# తొలి అక్షరం

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 05 పేజీలు - 6 శుక్రవారం 29 నవంబర్ 2024

## చలి గుప్పిట తెలంగాణ

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28:**

రాష్ట్రంలో చలి తీవ్రత పెరగుతున్నది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదు కావడం చలి తీవ్రతకు అద్దంపడుతున్నది. గురువారం ఆదిలాబాద్ జిల్లా భీమ్‌పూర్–టీలో అత్యల్పంగా 8.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 8.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 9.4 డిగ్రీలు, మెదక్ జిల్లా శివ్వంపేటలో 9.5 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 10 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా జుక్కల్‌లో 10.4 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా కోట్‌గిరిలో 10.4, కొండపాకలో 10.6 డిగ్రీలు, నిర్మల్ జిల్లా పెంబిలో 10.7 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మరిపల్లిలో 10.8 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## ప్రియాంక గాంధీ ఎంపీగా ప్రమాణ స్వీకారం...



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28:** కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఎంపీగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తల్లి సోనియా గాంధీ,సోదరుడు రాహుల్ గాంధీతో కలిసి ఆమె పార్లమెంట్‌కు హాజర య్యారు. శీతాకాల సమావేశాల్లో భాగంగా లోక్ సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ఆమెతో ప్రమాణం చేయించారు. తన చేతిలో ఉన్న రాజ్యాంగ పుస్తకం చూపిస్తూ ప్రియాంక ప్రమాణ స్వీకారం చేశారు. ప్రియాంక కు పలువురు అభినందన లు తెలిపారు. కేరళ సాంప్ర దాయాన్ని ప్రతిబింబించేలా ఆమె సభకు హాజరయ్యా రు. ఎంపీ హోదాలో ప్రియాంక గాంధీ తొలిసారి లోక్ సభలోకి ప్రవేశించారు. ప్రత్యక్ష ఎన్నికల్లో అరంగేట్రం చేసిన ఆమె మొదటి సారే భారీ విజయాన్ని అందుకున్నారు. ఇటీవల కేరళలోని వయ నాడ్ లోక్ సభ స్థానానికి ఉప ఎన్నిక జరగగా 4 లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో ఆమె భారీ విజయం సాధించారు. ప్రియాంక ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆమె పిల్లలు రైహాన్ వాద్రా, మిరయా వాద్రా హాజరై తల్లికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన సీఎం

- తరచూ స్కూళ్లు, హాస్టళ్లను తనిఖీ చేయాలి
- పిల్లల ఆహారంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు : సీఎం రేవంత్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28:** విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అంచించాలని సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తరచూ స్కూళ్లు, గురుకులాలను తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాల్లో ఆహార కల్తీకి బాధ్యులైనవారి వేటు వేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల స్కూళ్లలో ఉన్న విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి పలుమార్లు

వివరాలు 2లో

## రైతు భరోసాకు ఎగనామం

- రుణమాఫీ పేరుతో పంగనామాలు
- పంటల కొనుగోళ్లకు శఠగోపం
- ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఎగవేత
- దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించన ప్రభుత్వం
- రామన్నపేటను రావణకాష్టం చేసింది
- లగచర్ల రైతులను జైలుపాలు చేసింది
- రైతులకు కాంగ్రెస్ ఏమీ చేసిందని రైతు పండుగ?
- అల్లుడి కళ్ళలో ఆనందం చూసినందుకా?
- కాంగ్రెస్ రైతు పండుగపై కేటీఆర్ ఆగ్రహం



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28:** రైతులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చెయ్యలేదని బీఆర్ఎస్ లబోదిబో మంటుంటే.. కాంగ్రెస్ మాత్రం రైతు పండుగను 3 రోజులు చేసేందుకు భారీ ప్లాన్ వేసింది. లక్షల మంది రైతుల్ని మహబూబ్‌నగర్ జిల్లాకి తరలించబోతోంది. ఇదే బీఆర్ఎస్‌కి నచ్చట్లేదు. రైతులకు కాంగ్రెస్ సర్కార్ ఏమీ చెయ్యకపోగా, రైతు పండుగ చెయ్యడమేంటని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అంశాలపై తరచూ ట్వీట్లు పెట్టే కేటీఆర్.. తాజాగా మరోసారి అదే చేశారు. ఓ భారీ ట్వీట్ పెట్టారు.. అందులో.. "సిగ్గు లేదా జీడిగింజా అంటే – నల్లగున్నా

వివరాలు 2లో

## జార్ఖండ్ రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

### 14వ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరేన్ ప్రమాణ స్వీకారం



**తొలి అక్షరం/రాంచి,నవంబర్ 28 :** జార్ఖండ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఆ రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం చీఫ్ హేమంత్ సోరేన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రిగా హేమంత్ ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. రాంచీ లో జరిగిన ఈ కార్యక్రమానికి హేమంత్ సోరెన్ భార్య, పిల్లలు, తల్లిదండ్రులు షిబు సోరెన్, రూపి సోరెన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే,

వివరాలు 2లో

## ఆర్టీసీలో పలువురికి పదోన్నతులు

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28:** ఆర్టీసీలో ముగ్గురు డిప్యూటీ రీజినల్ మేనేజర్‌లకు (డీఆర్ఎంలకు) రీజినల్ మేనేజర్ (ఆర్ఎం)లుగా, ఇద్దరు రీజినల్ మేనేజర్(ఆర్ఎం)లకు ఈడీలుగా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేస్తున్న పీవీ మునిశేఖర్‌ను కార్పొరేషన్ సెక్రటరీ, ఆపరేషన్స్, ఎగ్జిక్యూటివ్, ఐటీ, మెయింటెనెన్స్ విభాగం ఈడీగా, సికింద్రాబాద్ రీజినల్ ఆర్ఎం ఖుస్రోషాఖాన్‌కు ఈడీగా పదోన్నతి కల్పించి కరీంనగర్ రీజియన్ ఈడీగా నియమించారు.రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ఆర్ఎం సంతోష్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి మహబూబ్‌నగర్ ఆర్ఎంగా, మెదక్ డిప్యూటీ ఆర్ఎం జోత్స్నకు పదోన్నతి కల్పించి నిజామాబాద్ ఆర్ఎంగా, రంగారెడ్డి డిప్యూటీ ఆర్ఎం బీ రాజుకు పదోన్నతి కల్పించి కరీంనగర్ ఆర్ఎంగా బదిలీ చేశారు. ప్రస్తుతం నిజామాబాద్ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న జానకీరెడ్డిని నల్లగొండకు, నల్లగొండ ఆర్ఎం రాజశేఖర్‌ను సికింద్రాబాద్‌కు, కరీంనగర్ ఆర్ఎం సుచరితను హెచ్ఆర్ ఆర్ఎంగా, మహబూబ్‌నగర్ ఆర్ఎం శ్రీదేవిని బస్‌భవన్ సీఈ (ఐటీ)గా బదిలీ చేస్తూ ఆర్టీసీ వైస్‌చైర్మన్, ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీచేశారు.




## భారీ విస్తరణపై 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల వ్యయం: ఐటీ మంత్రి

**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28:** ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ పరిశ్రమతో సర్క్యులర్ ఎకానమీ (వృత్తాకార ఆర్థిక వ్యవస్థ)కి తోడ్పడుతున్న అంకుర సంస్థ 'బన్యన్ నేషన్' రూ.200 కోట్ల పెట్టుబడితో భారీ విస్తరణ చేపట్టేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం నాడు సంస్థ ప్రతినిధులు సచివాలయంలో తనను కలిసిన అనంతరం ఆయన వివరాలు తెలిపారు. ప్రస్తుతం పటాన్ చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో 15 వేల

వివరాలు 2లో

## తెలంగాణపై తుపాన్ ఎఫెక్ట్

- రాష్ట్రంలో 3 రోజులు భారీ వర్షాలు..!
- పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో హెచ్చరికలు



**తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28:** లంగాణకు ఐఎండీ కీలక అలర్ట్ ఇచ్చింది. నేటినుంచి పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడుతాయని అంచనా వేసింది. పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.

వివరాలు 2లో

## దివ్యాంగుల త్వరలోనే రూ.6,000 పింఛన్

- దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలనూ భార్తీచేస్తాం
- మహిళా, శిశు, దివ్యాంగుల సం క్షేమ శాఖల మంత్రి సీతక్క




## నేడు దీక్షా దివస్..

- తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు
- అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు




## మరో 3 లక్షల మందికి త్వరలో రుణమాఫీ



## ఫుడ్ పాయిజన్‌పై స్పందించిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలల, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం ఆదేశించారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని.. వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## రైతు భరోసాకు ఎగనామం

(మొదటి పేజీ తరువాయి)

నాకేం సిగ్గు అన్నదంట! రైతు భరోసాకు ఎగనామం పెట్టి, రుణమాఫీ పేరుతో పంగనామాలు పెట్టి, పంటల కొనుగోళ్లకు శఠగోపం పెట్టి, ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఎగ్గొట్టి, దిలావర్‌పూర్‌లో దమనకాండ సృష్టించి, రామన్నపేటను రావణకాష్టం చేసి, లగచర్ల రైతులను జైలుపాలు చేసి, అల్లుడి కళ్ళలో ఆనందం చూసినందుకా?” అని కేటీఆర్ ప్రశ్నించారు. “రైతు పండుగలా ? పండుగలు మీకు, పస్తులు రైతులకు, చెప్పింది బారానా, చేసింది చారానా, కల్లాల్లో ధాన్యం పోసి, కళ్లల్లో వత్తులు వేసుకొని, కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు. నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టి కొనుగోళ్లు చేపట్టకపోవడంతో, అడ్డికి పావుశేరు లెక్కన దళారులకు అమ్ముకుంటున్నారు” అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

## వివరాలు నమోదు చేయించుకున్న సీఎం రేవంత్ రెడ్డి




తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన కుటుంబ వివరాలను కుల సర్వేలో నమోదు చేయించుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వేలో భాగంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరాలు నమోదు చేయించుకున్నారు.హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమీషనర్ ఇలంబర్తి , ఇతర అధికారులు, ఎన్యుమరేటర్లు, సిబ్బందితో కూడిన సర్వే బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి కుటుంబ వివరాలను నమోదు చేసుకున్నారు.సర్వే పురోగతి వివరాలను, సర్వేలో పాల్గొన్న ప్రజల స్పందన గురించి అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా కుల సర్వే పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగులు తప్పని సరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలో వీవీఐపీలు, ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు.

## జార్ఖండ్ రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆయన భార్య సునిత కేజ్రీవాల్, ఎంపీ రాఘవ్ చద్దా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన హేమంత్ సోరెన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఇటీవలే జరిగిన ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 81 నియోజకవర్గాలకు గానూ జేఎంఎం కూటమికి 56 స్థానాలు, ఎన్డీయే కూటమికి 24 స్థానాలు లభించిన సంగతి తెలిసిందే.



# డ్రగ్స్ నియంత్రణకై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి

- ప్రతి మండల పరిధిలో వారానికి రెండు విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- సామాజిక మాధ్యమాల ద్వారా డ్రగ్స్ వాడకం నివారణపై ప్రచారం చేయాలి
- డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అనువైన స్థలం ఎంపిక చేయాలి
- డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్





తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో,నవంబర్28: జిల్లాలో మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ ప్రాధాన్యత అంశంగా అధికారులు పని చేయాలని, ఈ దిశగా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తో కలిసి కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రాబోయే 3 నెలల పాటు డ్రగ్స్,మాదకద్రవ్యాల నియంత్రణ, వీటి వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం నిర్వహించుటకు ప్రాధాన్యతనిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.ప్రతి మండలంలో బృందాలు ఏర్పాటు చేస్తూ, వారానికి 2విద్యా సంస్థలను సందర్శిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై సామాజిక మాధ్యమాలను వినియోగించుకుంటూ క్యాంపెయిన్ చేపట్టాలని అన్నారు.డ్రగ్స్ వాడకం మనిషిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలిపే వీడియోలను గ్రామ వాట్సాప్ గ్రూప్ లలో ప్రచారం చేయాలని అన్నారు. మనకు అందుబాటులో ఉన్న స్పీకర్లను గుర్తించి డ్రగ్స్ వల్ల ఆరోగ్యానికి, కుటుంబానికి,ఆర్థికంగా కలిగే నష్టాలను వివరించే విధంగా అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు.సోమవారం నాటికి అవగాహన కార్యక్రమాల్లో ఏం మాట్లాడాలో నిపుణులతో మాట్లాడి ఫైనల్ చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. జిల్లాలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలు,రెసిడెన్షియల్ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు.డి- అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనం గుర్తించాలని, మాదకద్రవ్యాలు, డ్రగ్స్ అలవాటు ఉన్న వారిని అక్కడ చేర్పించి వారికి అవసరమైన చికిత్స అందించేందుకు ఏర్పాటు చేసి దాని నిర్వహణ బాధ్యతలను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేలా ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.డ్రగ్స్ కు బానిసలు అయిన యువకులు, పిల్లలపై కేసులు నమోదు కాకుండా వారి భవిష్యత్తు దృష్ట్యా అవసరమైన కౌన్సిలింగ్ చేసి డి అడిక్షన్ సెంటర్ ద్వారా డ్రగ్స్ వాడకం బానిసత్వం పోయేలా చర్యలు తీసుకోవాలని, డి అడిక్షన్ కేంద్రంలో చేరే వ్యక్తుల వివరాలు బయట ఎక్కడ తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ కు అరగంట, క్రీడలు ఆడేందుకు అరగంట షెడ్యూల్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.సమీక్ష లో అదనపు కలెక్టర్, మాట్లాడుతూ....ప్రతి మండలంలో డ్రగ్స్ నియంత్రణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, డి.డబ్ల్యూ.ఓ.రాంగోపాల్ రెడ్డి, మధిర షేర్ ఎన్.జి.ఓ. డైరెక్టర్ జి. గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ లు గోపాల్ స్వామి, ఎం. హనుమంతరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు దీక్షా దివస్..

- తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు
- అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను త్యాగం చేసేందుకు సిద్దపడ్డ గొప్ప నాయకుడు కేసీఆర్ అని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించే కార్యక్రమం ఏర్పాట్లను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, దీక్ష దివస్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జి ఇంచార్జి పొన్నాల లక్ష్మయ్య, సికింద్రాబాద్, అంబర్ పేట, ముషీరాబాద్ ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, మాజీమంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, నాంపల్లి, ఖైరతాబాద్ నియోజకవర్గాల ఇంచార్జిలు ఆనంద్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అంతకుముందు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహారదీక్ష తెలంగాణా ఉద్యమాన్ని కీలకమలుపు తిప్పిందని చెప్పారు. తెలంగాణ ప్రాంతంలోని అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ రాష్ట్రం రావాలి.. తెలంగాణ రాష్ట్రం కావాలని నినదించడం జరిగిందని గుర్తు చేశారు. అటువంటి దీక్షా దివస్‌ను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నగరంలోని అన్ని నియోజకవర్గాల నుండి బైక్‌లపై ర్యాలీగా బసవ తారకం హాస్పిటల్ సర్కిల్ వరకు చేరుకుంటారని, అక్కడి నుండి పాదయాత్రగా తెలంగాణ భవన్‌కు చేరుకోనున్నట్లు చెప్పారు. తెలంగాణ భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, కేసీఆర్ ఉద్యమ నేపథ్యాన్ని వివరించేలా ప్రత్యేకంగా రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించడం జరుగుతుందని, అనంతరం సభ నిర్వహణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు

# తెలంగాణపై తుపాన్ ఎఫెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

నైరుతి బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండం నెమ్మదిగా కదులుతుంది. గడిచిన 6 గంటల్లో గంటకు 2 కిమీ వేగంతో కదులుతుందని ఐఎండీ తెలిపింది. చెన్నైకి 480 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది.రాగల 12 గంటల్లో శ్రీలంక తీరాన్ని దాటి ఉత్తర-వాయువ్య దిశగా పయనమవుతుందని అంచనా వేసింది.ఉదయంలోపు తుపానుగా మారే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. శనివారం (నవంబర్ 30వ తేదీ) ఉదయం ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరి తీరాల సమీపంలో కారైకాల్ మరియు మహాబలిపురం మధ్య తీవ్ర వాయుగుండంగా తీరం దాటే అవకాశం ఉందని తాజా బులెటిన్ లో పేర్కొంది. ఈ ప్రభావంతో 3 రోజులు ఏపీలోని దక్షిణకోస్తాలో అక్కడక్కడ భారీ వర్షాలు,రాయలసీమలో శుక్ర,శనివారాల్లోఅక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలినచోట్ల విస్తారంగా తేలికపాటి-మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది.శనివారం దక్షిణకోస్తా,రాయలసీమలో కొన్నిచోట్ల భారీ-అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది డిసెంబర్ 1న తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, నాగర్ కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి.డిసెంబర్ 2వ తేదీన తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జగనాం, సిద్ధిపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ అయ్యాయి. మళ్లీ డిసెంబర్ 3,4 తేదీల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఎలాంటి హెచ్చరికలు లేవని ఐఎండీ వివరించింది.

# మరో 3 లక్షల మందికి త్వరలో రుణమాఫీ

- ఈనెల 30న ఖాతాల్లోకి డబ్బులు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28: రుణమాఫీ కాని వారిని డబ్బులు జమ చేయటంపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. బుధవారం షాద్ నగర్ లో మాట్లాడిన ఆయన పలు కారణాలతో రుణమాఫీ జరగని 3 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని పేర్కొన్నారు. నవంబర్ 30వ తేదీన మహబూబ్ నగర్ లో జరగనున్న రైతుపండగ సందర్భంగా డబ్బులు జమ చేస్తామని ప్రకటన చేశారు.రుణమాఫీకి రూ.18 వేల కోట్లు ఖర్చు చేశామని.. మిగతా రైతులకు కూడా అందజేస్తామని తెలిపారు. కుటుంబ నిర్ధారణ ప్రక్రియకు సమయం తీసుకోవటంతో పలువురు రైతులకు మాఫీ కాలేదని చెప్పారు. వ్యవసాయ శాఖాధికారులు గత 3 నెలలుగా రైతుల వివరాలు సేకరించారని... తప్పులను సరిచేశారని వివరించారు. వీరందరికీ ఈనెల 30వ తేదీన డబ్బులు చేస్తామని స్పష్టం చేశారు. కాగా తెలంగాణలోని కాంగ్రెస్ రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ స్కీమ్ ను పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో అధిక సంఖ్యలో రైతులకు రుణమాఫీ కాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం.. వారి వివరాలను సేకరించింది. కుటుంబ నిర్ధారణ చేసేందుకు మూడు నెలలపాటు సమయం తీసుకుంది. ఈ ప్రక్రియ పూర్తి కావటంతో రుణమాఫీ కాని వారికి స్కీమ్ ను వర్తింపజేయనుంది.

# భారీ విస్తరణపై ‘బన్యాన్ నేషన్’ రూ.200 కోట్ల వ్యయం: ఐటీ మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

టన్నుల వార్షిక సామర్థ్యంతో ‘బన్యాన్ నేషన్’ రీ సైక్లింగ్ పరిశ్రమను నిర్వహిస్తోంది. దీనిని 45 వేల టన్నులకు విస్తరించడానికి ఏర్పాట్లు చేసుకుంటోందని ఆయన చెప్పారు. విస్తరణ పూర్తయితే మరో 500 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ ను ఈ సంస్థ యూనిలివర్, టాటా మోటార్స్ లాంటి పెద్ద కంపెనీలకు విక్రయిస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. రూ.100 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న ‘బన్యాన్ నేషన్’ లాభాల్లో నడుస్తోందని చెప్పారు. కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం వారు మరికొంత భూమిని అడుగుతున్నారని, దీనిపై టీజీఐఐసీ నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఐటీ సలహాదారు సాయికృష్ణ, టీజీఐఐసీ సిఇఓ వి. మధుసూదన్, బన్యన్ నేషన్ సిఇఓ మణి వాజిపేయ్, సిఓఓ రాజ్ కిరణ్ మదనగోపాల్ లు పాల్గొన్నారు.


# దివ్యాంగుల త్వరలోనే రూ.6,000 పింఛన్

- దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలనూ భార్తీచేస్తాం
- మహిళా, శిశు, దివ్యాంగుల సం క్షేమ శాఖల మంత్రి సీతక్క



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 28: మహిళా, శిశు, దివ్యాంగుల సం క్షేమ శాఖల మంత్రి సీతక్క తాజాగా పెన్షన్‌కి సంబంధించి కీలక ప్రకటన చేశారు. దివ్యాంగుల పింఛన్‌ని త్వరలోనే రూ.6,000కి పెంచుతామని అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగిన దివ్యాంగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పింఛన్ పెంపుపై ఆమె మాట్లాడారు. అలాగే దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలనూ నింపుతామని అన్నారు. మిగతా వారికీ పెంపు?: పెన్షన్ పెంపు అనేది ఒక్క దివ్యాంగులకు మాత్రమే ఉండదు. పెంచితే.. అన్ని రకాల పింఛను దారులకూ పెంపు ఉంటుంది. ఆ రకంగా చూస్తే వృద్ధులు, బీడీ కార్మికులు ఇలా అందరికీ పెంపు వర్తిస్తుంది. అందువల్ల పెన్షన్ పెంపు అనేది ఇప్పుడు కీలక అంశంగా మారింది. పెంపు ఎప్పుడో మంత్రి క్లారిటీ ఇవ్వలేదు. అతి త్వరలో అన్నారు. అది ఎప్పుడో మాత్రం చెప్పలేదు. డిసెంబర్‌లో పెంపు ఉండే అవకాశాలు లేవు. ఎందు కంటే.. మిగిలిన రైతులకు రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు ఇచ్చేందుకే డబ్బు లేదు. అలాం టప్పుడు పెన్షన్ పెంపు డిసెంబర్‌లో ఉండటం కష్టమే. మరి జనవరి నుంచి ఇస్తారా అనేది చూడాలి. డిసెంబర్ 7 నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతుంది. అందువల్ల జన వరి నుంచి పెన్షన్ పెంచితే, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు అవుతుంది. పెంచకపోతే మాత్రం పెన్షన్ దారులను మోసం చేసినట్లే అవుతుంది. అందుకే.. పెంపు ఎప్పుడా అని వారు ఎదురుచూస్తున్నారు. ఏపీలో కూటమి పార్టీలు ఎన్నికల్లో మాట ఇచ్చినట్లుగానే పెన్షన్లను పెంచాయి. కూటమి ప్రభుత్వం జూన్‌లో అధికారంలోకి వచ్చినా, పెన్షన్లను మాత్రం ఏప్రిల్ నుంచే పెంచింది. దాంతో ఏపీలో పెన్షనర్లు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణలో మాత్రం పెన్షన్లను పెంచకపోవడంతో వారంతా.. పెంపు ఎప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా పెంచితే, వారు కూడా హర్షం వ్యక్తం చేస్తారు.

## మండల పరిషత్ కార్యాలయములో సమగ్ర సర్వే డేటా ఎంట్రీని పరిశీలించిన ఆర్డీ ఓ గణేష్



**తొలి అక్షరం/దంతాలపల్లి నవంబర్ 28:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల పరిషత్ కార్యాలయమును పరిశీలించిన తొర్రురు ఆర్డీ ఓ గణేష్,కార్యాలయంలో జరుగుతున్నా సమగ్ర సర్వే డేటా ఎంట్రీ గురించి అడిగి తెలుసుకున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కు సలహాలు, సూచనలు తెలియచేయడం జరిగింది.డేటా ఎంట్రీ శుక్రవారం వరకు కంప్లీట్ చేయాలి అని త్వరగా పూర్తి చేయాలి అని అవసరం అయితే ఎక్కువమంది ఆపరేటర్స్ ను పెట్టి చేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్ రావు,ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీవో అప్సర్ పాషా,ఏ ఎస్ ఓ తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన పిఏసిఎస్ చైర్మన్ సంపేట రాము



**తొలి అక్షరం/దంతాలపల్లి నవంబర్ 28:** గురువారం రోజు వరంగల్ లో రోస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సయ్యద్ బాలేష్అక్క కూతురు వివాహం వేడుకకు హాజరై నూతన వధువారులను ఆశీర్వాదించిన పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాము గౌడ్ ఆయన వెంట దుండి వెంకటేశ్వర్లు, అనపర్తి వీరన్న, సయ్యద్ మిషిని యాకూబ్ ,సయ్యద్ యాకూబ్ , బోర శ్రీనివాస్, తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిం చినారు.

## 29న జరిగే దీక్ష దివస్‌లో పార్టీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయండి

### బిఆర్ఎస్ జిల్లా నాయకులు బండి రమేష్



**తొలి అక్షరం/నరసింహుల పేట నవంబర్ 28:** తెలంగాణ వచ్చుడో–కేసీఆర్ సచ్చుడో అని నినదించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమ నాయకుడు బి ఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2009 నవంబర్ 29న కరీంనగర్ అలుగునూరులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజున వారిని అరెస్ట్ చేసి ఖమ్మం జైలుకు తరలించి నిర్బంధించారు.ఐనాపట్టు విడవకుండా 11రోజులు ప్రాణం పోయినా,ఎత్తిన పిడికిలి దించను,ఎత్తిన జెండా దించను,ఖచ్చితంగా రాష్ట్రం సాధిస్తా అని చెప్పిఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, కుట్రలను ఛేదించి,అకుంఠిత దీక్షతోఆనాటి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి 60 ఏండ్ల కల ఐన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలపెడుతున్నావ్ అని కేంద్ర ప్రభుత్వం చేత మొదటిసారి ప్రకటన చేపించిన ఉద్యమవీరుడు కేసీఆర్.ఆరోజుని,ఆ గొప్ప సందర్భాన్ని,అ దీక్షని మరొక్కసారి తెలంగాణ ప్రజలకు గుర్తు చేస్తూ దీక్ష దివస్ గా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నేల 29 తేది శుక్రవారం ఉదయం 10గం.ల నుండి సాయంత్రం 4గం.ల వరకు మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో సారధ్యంలో జిల్లా అధ్యక్షురాలుఅధ్యక్షతన జిల్లా స్థాయిలో దీక్ష దివస్ కార్యక్రమం జరుగుతుంది,ఈ కార్యక్రమానికి డోర్నకల్ నియోజకవర్గం అన్ని మండలాలు టిఆర్ఎస్ సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు

## మేధావులను తయారు చేయాలన్న గ్రంధాలయలు వారధిగా ఉంటాయి

- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్28:** మేధావులను తయారు చేయాలన్న గ్రంధాలయలు వారధిగా ఉంటాయనీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.ప్రపంచంలో మేదో శక్తిని పెంపొందించాలంటే, మేధావులను తయారు చేయాలన్న గ్రంధాలయలు వారధిగా ఉంటాయన్నారు.హనుమకొండ జిల్లా గ్రంధాలయం సంస్థ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన మొహమ్మద్ అజీజ్ ఖాన్ కి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్.నాగరాజు,ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర నాయకులు దొమ్మటి సాంబయ్య,రాష్ట్ర గ్రంధాలయం సంస్థ చైర్మన్ రియాజ్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.మొదటగా గ్రంధాలయంలో సరస్వతి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళీలు అర్పించారు.స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు.ఈ సభను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ...ప్రస్తుత సమాజంలో ఇంటర్నెట్ కాలంలో గ్రంధాలయాలకు ఆదరణ కరువైందనీ అన్నారు.నూతన చైర్మన్ గా ఎన్నికైన అజీజ్ ఖాన్ గ్రంధాలయాలకు పూర్వవైభవం తీసుకు రావాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి సమయానుకూలముగా సమూచిత స్థానం కల్పించే బాధ్యత నాది అని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.గతంలో నేను చైర్మన్ ఉన్నప్పుడు గ్రంధాలయాల్లో ఇంటర్నట్ సేవాలను ప్రారంభించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు,అభిమానులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నాయిని అధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 134వ వర్ధంతి వేడుకలు




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్28:** హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సామాజిక తత్వవేత్త,ఉద్యమకారుడు, సంఘసేవకుడు మహాత్మా జ్యోతిబా పూలే 134వ వర్ధంతి వేడుకలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళీలు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ....అంటరానితనం,కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన గొప్ప నాయకుడు పూలే అని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రగతి భవన్ పేరు మర్చి మహాత్మా జ్యోతబా పూలే ప్రజా భవన్ గా నామకరణం చేసి పూలే ఆశయాలను కొనసాగిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్ రావు,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కమలాపూర్ ఏఎంసి చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్,కార్పొరేటర్ మామిండ్ల రాజు,ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు పల్లకొండ సతీష్,జిల్లా ఓబిసి సెల్ చైర్మన్ బొమ్మతి విక్రమ్,వైస్ చైర్మన్ గజ్జి సాగర్,జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి లహరి,సీనియర్ నాయకులు బొంత సారంగం,శ్రీకర్,కవిత డివిజన్ అధ్యక్షులు పల్లపు రమేష్,కుమార్ యాదవ్,శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషితో సహా అనేక రంగాలకు ఆయన కృషి విస్తరించింది

- తొర్రూర్ ప్రజాసంఘాల నాయకులు

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 28:** అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషితో సహా అనేక రంగాలకు ఆయన కృషి విస్తరించింది అనితొర్రూర్ ప్రజాసంఘాల నాయకులు అన్నారు.గురువారం విగ్రహ ప్రతిష్టాపన కమిటీ కో–కన్వీనర్ రాయిశెట్టి వెంకన్న ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిభా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన తొర్రూర్ ప్రజాసంఘాల నాయకులు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన మరియు మహిళలు మరియు అతను మరియు అతని భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శకులు.అణగారిన వర్గాల ఆశాజ్యోతి దళిత రత్న అని ఈసందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో నకిరేకంటి కొమురయ్య, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యదర్శి కొత్తపెల్లి రవి, ముంజంపెల్లి వీరన్న, తొర్రూరు మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ ఎన్నామనేని శ్రీనివాస్ రావు, మాదిగ జాక్ రాష్ట్ర కార్యదర్శి రాయిశెట్టి ఉపేందర్,(ఎం ఆర్ పి ఎస్)జిల్లా నాయకులు వెల్తురి పూర్ణచందర్, మూల్ నివాసి కారుపాటి లక్ష్మయ్య, విద్యార్థి నాయకులు డా. ధర్మారపు నాగయ్య, అంబెడ్కర్ సంఘం తొర్రూరు మండల అధ్యక్షులు రాయిశెట్టి యాకేందర్, సంఘం మండల నాయకులు మంగళపెల్లి బాలాజీ, చిలుక మల్లేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు



## ఖమ్మంలో యాగశాల సందర్శన, ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎంపీ వద్దిరాజు





**తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో,నవంబర్28:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం మమత రోడ్డులో ఎస్బీఐటీ సమీపాన గల సహస్ర చండీ సహిత మహా రుద్ర యాగశాలను సందర్శించి తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు.శ్రీశ్రీశ్రీ బండ్లమాంబ రాజమాత ఆశీస్సులతో సహస్ర చండీ సహిత వారాహి,ప్రత్యంగిరా,బగళా,శ్రీవిద్యా పూర్వక మహా రుద్రయాగం జరుగుతున్న సంధర్భంగా ఎంపీ రవిచంద్ర గురువారం యాగశాలను సందర్శించి హోమ గుండాలకు భక్తి ప్రపత్తులతో నమస్కరించి తన కూతురు–అల్లుడు డాక్టర్ గంగుల గంగాభవాని –గంగుల సందీప్ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేద పండితుల ఆశీర్వచనాలు,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అన్ని రంగాల్లో యూనివర్సిటీ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం దోహదం

- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్28:** గతంలో కంటే అన్ని రంగాల్లో యూనివర్సిటీ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం దోహదదుతుందనీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.సమకాలీన భారతదేశంలో సామాజిక సంస్థలు ద్వారా ప్రపంచీకరణ,అభివృద్ధి సామాజిక పరివర్తన పై కాకతీయ యూనివర్సిటీ లో సామజిక విభాగ ఆధ్వర్యంలో సెనట్ హాల్ లో నిర్వహించిన సెమినార్ కి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సంద్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.... చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాకతీయ యూనివర్సిటీ పట్ల ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు.సమాకాలిన ప్రపంచంలో మారుతున్న నవీన కాలానికి అనుగుణంగా పరివార్తన ఉండాలని కోరారు.మానవ సంబందాలు దూరం అవుతున్న తరుణంలో వారికీ కాలపరమైన బోధన, పరివార్తన పట్ల ప్రత్యేక దృష్టి సరించారని అన్నారు.పిన్న వయస్కులు,మధ్య వయస్కులు,వృద్ధుల జీవన శైలి ప్రమాణలపట్ల ఎప్పటికప్పుడు అధ్యాయనాలు చేయాలన్నారు.అంతక ముందు కాకతీయ యూనివర్సిటీ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళీలు అర్పించారు. వీసీ ప్రొ.కె.ప్రతాప్ రెడ్డి వైస్ ఛాన్సలర్,కాకతీయ విశ్వవిద్యాలయం,ప్రొఫెసర్లు వెంకట నారాయణ, ఘంటా చక్రపాణి, గణేష్, ఉమా మోహన్,హనుమంత్ రావు,మనోహర్, మల్లిఖార్జున రెడ్డి, రాములు,ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, బోడ డిన్న, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలి: తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 28:** సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలని తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు.ధర్మా శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ బానోత్ విమల–కృష్ణల కుమారుడు బానోత్ జయప్రకాష్ నారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని ధర్మ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం తొర్రూర్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు, బిస్కెట్ లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకొని రికార్డులు, వంటలను పరిశీలించారు.ఈ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ రామచంద్రయ్య పాల్గొని ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరం మేరకు సేవలు అందించేలా ధర్మాశ్రీ చారిటబుల్ ట్రస్ట్ కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఆదుకునేందుకు ట్రస్ట్ ముందుకు వచ్చి, పేద విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందించడం సంతోషకరమన్నారు.ఈకార్యక్రమంలో ఎల్ఐసి డివో ధరావత్ శంకర్, ఉపాధ్యాయులు సునీత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి ట్రస్ట్ కి లక్ష విరాళం అందించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




**తొలి అక్షరం/ఖమ్మం బ్యూరో,నవంబర్28:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం ముస్తఫా నగర్ పెట్రోల్ బంక్ సమీపాన గల శ్రీదివ్య మణికంఠ అన్నదాన సేవా సమితి ట్రస్ట్ ని సందర్శించి స్వాములతో కలిసి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎంపీ రవిచంద్ర తన సన్నిహితులు తోట వీరభద్రం, వేముల శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి గురువారం మధ్యాహ్నం ట్రస్ట్ ని సందర్శించారు. ఎంపీ రవిచంద్ర కొబ్బరికాయలు కొట్టి దీపం వెలిగించారు.ట్రస్ట్ కు లక్ష రూపాయలు విరాళం అందజేసి స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు.ట్రస్ట్ ఛైర్మన్ చిర్రా రవి, ప్రముఖులు మువ్వల కృష్ణమూర్తి,చందా రాంబాబు,నిదిగొండ శేఖర్, రవితేజ,మాచర్ల నరేష్,గుమ్మడెల్లి హరీష్ స్వాములు ఎంపీ వద్దిరాజు, తోట వీరభద్రం లను కండువాలతో సత్కరించి ప్రసాదం అందజేశారు.

## బీసీ మహాసభ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే గారి వర్ధంతి

● మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం... వారి అడుగుజాడల్లోనే నడుద్దాం




**తొలి అక్షరం/షాద్ నగర్ :నవంబర్ 28:** బీసీ మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యాసెట్ శీను ఆధ్వర్యంలో మహాత్మజ్యోతి రావు పూలే వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్ కుమార్ పాల్గొని మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు . మానపాటి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మహిళా జనోద్ధారకుడు..వివక్ష లేని విద్యకు ఆద్యుడు..మొదటి మహిళా ఉపాధ్యాయుల కోసం పోరాడిన గొప్ప మేధావి, సమాజంలో స్త్రీ, పురుషులు సమానం అనే నినాదంతో ముందుకు సాగి, అంటరానితనంపై పోరాడిన యోధుడని అన్నారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో మనమందరం నడచుకోవాలని అన్నారు. బీసీ మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు క్యాసెట్ శీను మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,బాలికల,మహిళల విద్యా కోసం నిరంతరం కృషి చేసిన మహాత్ముడు అని అన్నారు. రంగారెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షులు ఏవీఎం శ్రీధర్ వర్మ మాట్లాడుతూ 1873 సెప్టెంబరు 24న, పూలే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేశాడు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసి విద్యకు మార్గదర్శకులు అయ్యారు. మహాత్మ జ్యోతిబాపూలే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించారని అన్నారు. రంగారెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షులు ఏవీఎం శ్రీధర్ వర్మ , రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య , యువత జిల్లా ఉపాధ్యక్షులు మంగ అశోక్, ముదిరాజ్ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పూజారి మల్లేష్ , వేణుగోపాల్ , గుడాల గిరిబాబు , వెంకటేష్ , మంకాల శ్రీశైలం పాల్గొన్నారు.

## కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

● ఉన్నతమైన చదువే చెరుగని ఆస్తి: మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ

● ఆర్థిక పరిస్థితులు విద్య అడ్డు కాదు: ఎమ్మార్వో ఫణి కుమార్




**తొలి అక్షరం/చెన్నారావుపేట,నవంబర్ 28:** మండల కేంద్రంలో కస్తూరిబా బాలికల హాస్టల్లో 300 మంది విద్యార్థులకు కలామ్స్ ఫౌండేషన్ ఉప్పరపల్లి వారి ఆధ్వర్యంలో అందే యాదగిరి–లావణ్య,మమ్మద్ హఫీజ్, మమ్మద్ నజియా బేగం వారి ఆర్థిక సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ, ఎమ్మార్వో ఫణి కుమార్, ఎంపీడీవో శ్రీవాణి, ఏంఈవో బైరి సరళ,ఎస్సై రాకేష్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులకు దూరమవుతున్నారని ఉద్దేశంతో ప్రభుత్వాలు కస్తూర్బా స్కూల్ ప్రారంభించారని,ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సమన్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు,ఎన్ని ఆస్తులు అంతస్తులు ఉన్నా అవి చిరకాలం ఉండవని విద్యనే ఎల్లప్పుడూ మనకు సహకారంగా ఉంటుందని ఆయన సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో ఫణి కుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితులు విద్యకు అడ్డు కాదని, వీధిలైట్లకింద కూర్చుని చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన ఏపీజే అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.దుప్పట్ల దాత:– అందే యాదగిరి–లావణ్య(%ఖుూా%) మాట్లాడుతూ..విద్యతోటే సమాజంలో గౌరవ మర్యాద దక్కుతాయని,విద్య తోటే సమాజంలో మంచిగుర్తింపు సాధ్యమవు తుందని,ఉన్నతమైన ఆశయాలను సాధించాలంటే విద్య ప్రధానమని ఆయన అన్నారు,విద్య పరంగా నా నుండి ఎల్లవేళలా మీకు సహకారం ఉంటుందని విద్యార్థులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ మిట్టపల్లి జ్యోతి, కలామ్స్ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎండి భాష మియా, పరికి మధుకర్,మరో దాత మహమ్మద్ హఫీజ్,లీగల్ అడ్వైజర్ ఊడుగుల రాజు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూక్య గోపాల్ నాయక్,ఎన్ హెచ్ ఆర్ సి డబ్ల్యు ఓ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నర్మెట యాదగిరి,బొమ్మెర యాలాద్రి,కలామ్స్ ఫౌండేషన్ ఉపా ధ్యక్షులు పోగుల అశోక్, కోశాధికారి హనుమాన్ల రాజేందర్, పెళ్లి ప్రభాకర్ ఊడుగుల రాజ్ కుమార్,మరియు ఉపాధ్యాయురాలు,రాజలక్ష్మివిజేత,రజిత,షాహిన,కవిత,సప్న,భార్గవి పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి: టీచర్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 28:** బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి టీచర్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ అన్నారు.మహిళల పై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గురువారం టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తొర్రూర్ పట్టణ కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో (కేజీబీవీలో ) బాలికల విద్య మహిళలపై హింస అనే అంశంపై అవగాహన సమావేశం టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు చింతల సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా చింతల సురేష్ మాట్లాడుతూ..బాలికలు స్వేచ్ఛయుత వాతావరణంలో విద్య అభ్యసించాలన్నారు.అదే విధంగా స్త్రీలు హింసకు వివక్షకు గురవుతున్న సందర్భంలో హింసకు తావులేని స్వేచ్ఛాయిత సమాజాన్ని నిర్మించడంలో బాలికలు రాబోయే కాలంలో కీలకపాత్ర వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ సేవే మార్గం సేవే లక్ష్యంగా పనిచేస్తుందని దానిలో భాగంగా కస్తూరిబా గాంధీ విద్యాలయానికి అవసరమైన కుర్చీలను ఈరోజు అందించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ చార్టర్ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి వెలిదే సురేష్,కోశాధికారి ఎద్దు వెంకన్న, పూర్వ అధ్యక్షులు డయాబెటిక్ క్యాంప్ చైర్మన్ రాయిపెల్లి యాకయ్య, క్లబ్ ప్రతినిధులు, ఇల్లందుల శ్రీనివాస్, బాతుక బుచ్చిరామయ్య, కొలుపుల శ్రీనివాస్,మరియు పాఠశాల ఇన్చార్జి, ప్రధానోపాధ్యాయురాలు మనెమ్మ, సబిత, నాగలక్ష్మి మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## "నాగార్జున విద్యాలయం నందు షీటీం, ఏహెచ్‌టియు, భరోసా అవగాహన సదస్సు







**తొలి అక్షరం/మహబూబాబాద్ నవంబర్ 28:** మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశానుసారంగా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో గురువారంనాగార్జున విద్యాలయం, కురవి, మహబూబాబాద్ నందు షీ టీం భరోసా మరియు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.నేరాలు అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని మహబూబాబాద్ సి టీం ఎస్సై సునంద ఆమె అన్నారు. నాగార్జున విద్యాలయం కురవి మహబూబాబాద్ లో దాదాపు 250 మంది విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాలు మహిళలపై అత్యాచారాలు విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కార్యక్రమంలో నిర్వహించినారు.విద్యార్థులు ఈవిటీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్ లపై అవగాహన పెంచుకోవాలని అన్నారు ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలలో వ్యక్తిగత ఫోటోలు వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలి వివరించారు. మనకు తెలియని నెంబర్స్ నుండి మహిళలకు ఎవర్ నుండైనా ఇబ్బందులు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీం వారికి సమాచార అందించాలని సూచించారు. మా షీ టీం మొబైల్ నెంబర్స్ మరియు వాట్సాప్ నెంబర్స్ 871 2656 935 790 11 42 009 ఫిర్యాదు చేయవచ్చని ఫిర్యాదు చేసిన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అత్యవసర సమయంలో పోలీస్ ఎమర్జెన్సీ నెంబర్ డయల్ 100 సేవల కూడా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కొరవి పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంద్ర సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తత గా ఉండాలని పేర్కొన్నారు. లోన్ యాప్,లాటరీ పార్ట్ టైం జాబ్స్ ,విదేశీ ప్రయాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పాన్ కార్డు అప్డేట్స్, ఆధార్ కార్డు లింక్ పేర్లతో సైబర్ మోసాలు మెసేజ్ రాగానే ఆశపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండడం చాలా ముఖ్యమని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి తక్షణం కాల్ చేసి వివరాలు తెలపాలని కోరారు. మీకు ఎలాంటి సమస్య ఎదురైనా డయల్ 100 కి కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు.యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి మానవ అక్రమ రవాణా ఏ విధంగా జరుగుతుంది ,విద్యార్థులు ఎలా జాగ్రత్తగా ఉండాలి అని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఉమెన్ కానిస్టేబుల్ సుప్రజా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యాలయం కరస్పాండెంట్ రవి ర సీనియర్ మరియు వారి అధ్యాపక సిబ్బంది,షీ టీం సిబ్బంది అరుణ,రమేష్,భరోసా స్టాప్ బేబీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

● మండల మాజీ యూత్ అధ్యక్షుడు బండి రమేష్



**తొలి అక్షరం/నర్సింహులపేట, నవంబర్ 28:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని బిఆర్ఎస్ జిల్లా నాయకులు మండల మాజీ యూత్ అధ్యక్షుడు బండి రమేష్ అన్నారు గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ . ప్రభుత్వ పాఠశాల విద్యపై టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో విధ్వంసం చేసిందని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించి మార్పు పేరుతో అధికారంలోకి వచ్చి కార్పొరేట్, ప్రైవేటు శక్తులను పెంచి పోషించేందుకు ప్రయత్నాలు సాగించడం సరైంది కాదన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ప్రభుత్వం సరైన దృష్టి పెట్టకపోవడంతో ఫుడ్ పాయిజన్ తో పాటు ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనేవిద్యాశాఖ మంత్రినికేటాయించి ప్రభుత్వ విద్యను బలోపేతానికి కృషి చేయాలని ఆయనడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ములవంచ గ్రామ పార్టీ అధ్యక్షులుపటేల్ రామన్న, రేఖ శీను, సురేష్, తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణా ఉద్యమ కారుడికి దక్కిన గౌరవం

● షాద్ నగర్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి.కరుణాకర్



**తొలి అక్షరం/షాద్ నగర్: నవంబర్ 28:** ప్రముఖ మలిదశ తెలంగాణా ఉద్యమకారుడు,ప్రముఖ విద్యావేత టి.కరుణాకర్ ఇటీవలే షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిఏఎం డిగ్రీ కళాశాల అధ్యపకబృందం ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బి,ఏ,ఎం డిగ్రీ కళాశాల పొలిటికల్ సైన్స్ సీనియర్ అద్యాపకుడు ఎలుకుర్తి నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు మరియు ప్రముఖ విద్యావేత్త అయినా టీ.కరుణాకర్ ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించడం చాలా హర్షదాయకమని, కరుణాకర్ భవిష్యత్తులో మరిఎన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరాడు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. వెంకటయ్య గౌడ్, మనివర్ధన్ రెడ్డి,విజయ్ కుమార్, నీరటి మచ్చేందర్, మల్లికార్జున్,శ్రీకాంత్, ప్రవీణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## జాబ్ మేళా... శ్రీ సాయి అగ్రి టెక్నాలజీస్ కంపెనీ నందు ఉద్యోగ అవకాశాలు



**తొలి అక్షరం/మహబూబాబాద్, నవంబర్.28:** మహబూబాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీ సాయి అగ్రి టెక్నాలజీస్ కంపెనీ నందు "ఫీల్డ్ స్టాఫ్, మార్కెటింగ్ సేల్స్ ఆఫీసర్ " గా మహబూబాబాద్ జిల్లా పరిధిలో పనిచేయటకు ఇంటర్ ఆ పైన విద్యార్హతతో ద్విచక్ర వాహనంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండి ఆసక్తి కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు తేదీ. 30.11.2024 రోజున జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి. రజిత గురువారంఒక ప్రకటనలో ఆమెతెలిపారు.అర్హత ఆసక్తి కలిగిన అభ్యర్థులు తేదీ 30.11.2024 న ఐ.డి.ఓ.సి లోని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కార్యాలయం, రూం. నెం.25 రెండవ అంతస్థు లో జరుగు జాబ్ మేళాకు తమ రెజ్యూమ్, ఆధార్ బ్యాంకు ఖాతా వివరాలు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత కాపీలు, పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పెదబోయిన ఐలమల్లు

**తొలి అక్షరం/డోర్నకల్/మరిపెడ ప్రతినిధి నవంబర్ 28** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం బురహాన్ పురం గ్రామంలో కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పెద్ద బోయిన ఐలమల్లు మాట్లాడుతూ డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచందర్ నాయక్ ఆదేశాలనుసారంగా సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారు మల్లికంటి ఎల్లమ్మ కు 28000 రూపాయల చెక్కు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని రాష్ట్రంలోనే పేద వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిం దని గుర్తు చేశారు. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2 వందల లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా,పంటల భీమా పథకాలకు రైతన్నలు అందుకుంటున్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు.



# అయ్యప్ప భక్తులు పట్ల దురుసుగా ప్రవర్తించిన తొర్రూర్ డిపో మేనేజర్‌ను సస్పెండ్ చేయాలి

- ఆర్టీసీ రీజనల్ మేనేజర్ (ఆర్ఎం) వరంగల్ వినతిపత్రం
- బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) నవంబర్ 28:** అయ్యప్ప భక్తులు పట్ల దురుసుగా ప్రవర్తించిన తొర్రూర్ డిపో మేనేజర్ ను సస్పెండ్ చేయాలని బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. గురువారం బీజేపీ తొర్రూర్ శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ (ఆర్ఎం) వరంగల్ వినతిపత్రం అందజేయడం జరిగింది. బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ మాట్లాడుతూ.. తొర్రూర్ ఆర్టీసీ డిపో లో అయ్యప్ప మాలాదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేస్తూ అవమానిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని,అయ్యప్ప మాలాదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయడం అవమానకరం అని,ఇది ముమ్మాటికీ యావత్ హైందవ సంస్కృతి సాంప్రదాయాలను,ఆచార వ్యవహారాలను అవమానించడమేనని,కఠిన నియమాలతో ఎంతో నిష్టగా పవిత్ర దీక్షలో ఉన్న అయ్యప్ప మాలాదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయడం అయ్యప్ప భక్తుల విశ్వాసాన్ని నమ్మకాన్ని,దీక్షను అపవిత్రం చేయడమేనని, అయ్యప్ప భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తించిన డిపో మేనేజర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని, అయ్యప్ప మాలాదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసిన సిబ్బంది ని వెంటనే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలన లో హిందువులు అడుగడుగునా అవమానాలు ఎదుర్కొంటున్నారని, హైందవ ధర్మాన్ని అవమానించిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని, ఈరోజు తొర్రూరు అయ్యప్ప భక్తుల్లో చైతన్యం వచ్చి డిపో ఎదుట ఆంధోళన చేయడం శుభసూచకం అని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలలో అయ్యప్ప మాలాదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షల నుంచి మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి హిందువుల మనోభావాలను గౌరవించాలని, కూడా అయ్యప్ప భక్తుల కు భేషరుతుగా క్షమాపణలు చెప్పాలని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి తొర్రూరు డిపో మేనేజర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ఆలయ సంరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మార్క సునీల్,వీహెచ్పీ వరంగల్ విభాగ్ కార్యదర్శి శ్రీరాం ఉదయ్ కుమార్,వీహెచ్పీ వరంగల్ నగర సహాయ కార్యదర్శి ఎడెల్లి సందీప్, బీజేపీ తొర్రూరు ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్,బీజేవైఎం మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్, బీజేవైఎం మానుకోట జిల్లా కాలేజీ అవుట్ రీచ్ కన్వీనర్ నూకల నవీన్,మండల నాయకులు పప్పుశెట్టి సంతోష్ పాల్గొన్నారు.

## నేడు దీక్ష ది వన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- బిఆర్ఎస్ మండల అధ్యక్షులు దేవేందర్
- జిల్లా నాయకులు బండి రమేష్



**తొలి అక్షరం/నరసింహుల పేట నవంబర్ 28:** దీక్ష దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైదాం దేవేందర్.జిల్లా నాయకులు బండి రమేష్ అన్నారు మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దీక్ష దివాస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శుక్రవారం మహబూబాబాద్ జిల్లా బి ఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్రం కోసం నవంబర్ 29న తెలంగాణ వచ్చుడు కేసీఆర్ చర్చలో అనే నినాదంతో దీక్ష చేపట్టడం జరిగింది. ఆ నిర్ణయంతో తెలంగాణ రాష్ట్రం సాధించడం జరిగింది. ఆ కార్యక్రమంలో ఆనాటి ఉద్యమకారులు పార్టీ శ్రేణులు వాళ్ళ పోరాటాలను ఆనాడు వారు చేసిన శ్రమ ఈతరం యువకులకు మేధావులకు అర్థమయ్యే విధంగా వారికి సన్మాన కార్యక్రమాలు ఆనాటి రోజులను నెమరు వేసుకునే విధంగా కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షురాలు నిర్వహించడం జరుగుతుంది. డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రతి మండలము నుండి గ్రామాల నుండి కార్యకర్తలు తరలి రావాలని వారు కోరారు ఈ కార్యక్రమం లో పటేల్ రామన్న వెంకటేశ్వర్లు కాజామియా మాజీ ఉపసర్పంచ్ కార్ల నాగన్న మాజీ వార్డ్ నెంబర్ఎండి మదర్ పాల్గొన్నారు.

## పూలే వర్ధంతి సందర్భంగా నివాళు లర్పించిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ ధనుంజయ్, బీఎస్పీ పార్టీ నేత బుర్రి సాగర్



**తొలిఅక్షరం/నర్సంపేట, నవంబర్ 25:** నియోజకవర్గం లో తనుగుల రామచంద్రు నర్సంపేట బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించిన బీఎస్పీ నాయకులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ ధనుంజయ్,బీఎస్పీ బుర్రి సాగర్,పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ దేశంలో మొట్టమొదటిగా చదువుకునే హక్కు కల్పించిన వ్యక్తి మన జ్యోతిరావు పూలే ఆనాటి రోజుల్లో బ్రాహ్మణులకే చదువు ఉండేది మిగతా అన్ని కులాలకు చదువు లేదు ఆ క్రమంలో అందరికీ చదువు ఉండాలని జ్యోతిరావు పూలే తన భార్య అయిన సావిత్రిబాయి పూలే ఇద్దరు తమ సంతానాన్ని త్యాగం చేసి దేశ ప్రజల కోసం అణగారిన వ్యక్తుల కోసం వారి జీవితాంతం పోరాటం చేసి ప్రజలను చైతన్యం చేసి చదువు నిచ్చిన గొప్ప మహనీయు లు ఈ దేశ చదువుల తల్లిదండ్రులు ఉన్నారంటే వారు జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే మాత్రమే అని కొనియాడారు. పేదవారి జీవితం మారాలంటే విద్య ద్వారా తప్ప మరేది కాదని అనేక స్కూల్లో ఏర్పాటు చేసి అణిగారిన వ్యక్తులకు చదువునిచ్చి వాళ్ళ జీవితాల్లో వెలుగునిచ్చిన మహానీయుడు జ్యోతిరావు పూలే ఎంత చెప్పినా వారి గురించి తక్కువ అయితుంది కాబట్టి ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పిస్తూ దేశంలో విద్యారంగంలో వైద్యరంగంలో అగ్రస్థాయిల మనం ఎదగాలంటే బహుజన రాజ్యం రావాలని కొనియాడారు ఈ కార్యక్రమంలో తనుగుల శ్రీకాంత్ నర్సంపేట నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి యాకయ్య సమ్మక్క సరిత నవ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ ప్రోగ్రాంకు ఎంపికైన శ్రీ వాణి



**తొలిఅక్షరం/నర్సంపేట, నవంబర్ 25:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాదన్నపేటలో 9వ తరగతి చదివుతున్న విద్యార్థిని సుంచు శ్రీవాణి రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ ప్రోగ్రాం కు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలూరు రామచంద్రు తెలిపారు. జిల్లాస్థాయి ఇన్స్పైర్ అవార్డ్స్ కార్యక్రమం శివాని పబ్లిక్ స్కూల్లో పాఠశాల విద్యాశాఖ వరంగల్ ఆధ్వర్యంలో నవంబర్ 26 నుండి 28 వరకు నిర్వహించారన్నారు. ఈ ఇన్స్పైర్ ప్రదర్శనలో 148 ప్రదర్శనలతో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా అందులో 14 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. వాటిలో మాదన్నపేట పాఠశాల విద్యార్థిని సుంచు శ్రీవాణి ఎంపిక అవ్వడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలూరి రామచంద్రు మరియు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. శ్రీవాణి గైడ్ టీచర్ అర్చన మేడం కి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవాణి తయారుచేసిన ఎగ్జిట్ వర్షాకాలంలో ఎక్కువ బట్టలను తక్కువ సమయంలో సులభంగా ఆరబెట్టడం ప్రదర్శనను చాలా చక్కగా వివరించారు. డివైస్ ఫర్ డ్రైవింగ్ మోర్ క్లోత్స్ ఇన్ షార్ట్ టైం డ్యూరింగ్ రేని సీజన్ తక్కువ ఖర్చుతో ఈ ప్రదర్శనను నిర్వహించడం అభినందనీయమని మరియు రాష్ట్రస్థాయికి ఎంపిక ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## బహుజన ధిక్కార దార్శనికుడు జ్యోతిరావు పూలే



**తొలి అక్షరం/నరసింహుల పేట నవంబర్ 28:** వెనుకబడ్డ, అణచివేయబడ్డ కులాల మార్గదర్శులు అణగారిన ప్రజల హక్కుల కోసం జీవితాలను త్యాగం చేసిన ఆదర్శమూర్తులు కులవివక్షకు గురై దాన్ని రూపుమాపడానికి కంకణబద్ధులై కొత్తబాటలు పరిచిన మహనీయులు అని కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్ అన్నారు గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాటా డుతూ 134 వర్ధంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నరసింహుల పేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు మతంలో ఉన్న దురాచారాలను నిరసించి అంతటితో ఆగక, దానికి పరిష్కార మార్గంగా విద్యాలయాలు, సత్యశోధక సమాజము, శిశుసదనా లు, వితంతు శరణాలయాలు స్థాపించిన సంస్కారశీలురు అన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: ఎస్సైసురేష్



**తొలి అక్షరం/నర్సింహులపేట నవంబర్ 28:** ప్రతి ఒక్కరికీ సైబర్ నేరాలపై అప్రమత్తతతో పాటు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై మాలోత్ సురేష్ అన్నారు. నర్సింహులపేట గ్రామానికి చెందిన మంచినిళ్ళ సాయి వర్ధన్ అనే వ్యక్తికీ గుర్తుతెలియని వ్యక్తి అతనికి ఫోన్ చేసి నీ మీద సైబర్ క్రైమ్ లో కేస్ అయినది అని చెప్పి నువ్వు 48,760/- రూపాయలు పంపితే నీ మీద కేసు ఉండదని చెప్పగా సాయి వర్ధన్ అతనికి యూపీఐ లింక్ ద్వారా డబ్బులు పంపడం జరిగింది . ఈ విషయంపై సాయి వర్ధన్ ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైమ్, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై ఫేక్ లోన్ యాప్‌ల ద్వారా, సామాజిక మాధ్యమాల్లో లింక్‌లను పంపి ఇన్వెస్ట్మెంట్ చేయాలని నమ్మించడం, ఆన్లైన్లో జాబ్స్ ద్వారా, వర్క్ ఫ్రం హౌం అంటూ ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చంటూ వివిధ రకాలుగా మోసగించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. కావున జాగ్రత్తగా ఉండి మీ చుట్టుపక్కల వారిని కూడా జాగ్రత్తపరచాలని సూచించారు. అత్యాశకు వెళ్లి మోసపోవద్దని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోరారు. యువత మత్తుపదార్థాలకు బానిస కాకూడదని, వాటివల్ల జీవితం నాశనమవుతుందని తెలిపారు. కావున, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా ఉండాలని, అలాగే మీ చుట్టుపక్కల తెలిసిన వ్యక్తులు గాని, స్నేహితులు గాని ఎవరైనా మత్తుపదర్థాలకు బానిసైనట్టు తెలిసినా, రవాణా, అమ్మకం, వినియోగం గురించి ఎటువంటి సమాచారం వున్నా దగ్గరలో వున్న పోలీస్ స్టేషన్లో గానీ, 100కు సమాచారం అందించాలని తెలిపారు.

## సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం

- పాల్గొన్న పిఎసిఎస్ చైర్మన్ మారం రాము

**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రం తెలంగాణ తల్లి సెంటర్ లో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన. నెక్కొండ పిఎసిఎస్ చైర్మన్ మారం రాము, మరియు అడ్వకేట్ కొమ్ము రమేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ దొనికేనా సారంగపాణి, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు గిరగాని శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొనిజేటి బిక్షపతి, సీనియర్ నాయకులు దాసరి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, వార్డు మెంబర్ల ఫోరం మాజీ రాష్ట్ర కార్యదర్శి తోట సాంబయ్య, కారింగుల సురేష్, ఈదునూరి వెంకటేశ్వర్లు, కొయ్యడి శ్రీనివాస్, పోరండ్ల శ్రీనివాస్, రేగుల అశోక్, బొడ్డుపల్లి రాజు, ఈదునూరి శ్రీనాథ్,పాల్గొన్నారు.



## పీడిత ప్రజల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే

- సామాజిక విప్లవ చైతన్య స్ఫూర్తి జ్యోతిబాపూలే
- ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే 134వ, వర్ధంతి



**తొలిఅక్షరం/నెక్కొండ,నవంబర్ 28:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో మాంకాల యాదగిరి, అంబేద్కర్ యువజన సంఘం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే 134వ, వర్ధంతి కార్యక్రమంలో జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాలర్పించడం జరిగింది, ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాంకాల యాదగిరి హాజరై మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే బాల్యంలో అనుభవించిన మనువాదుల కుల వివక్షత ఆలోచన వరుడిగా మార్చాయి, అణగారిన వర్గాలలో కుల నిర్మూలన దృక్పథాన్ని బోధించి అగ్రకుల వర్గానికి వ్యతిరేకంగా అట్టడుగు వర్గాలను సామాజిక విప్లవం దిశగా మేల్కోల్పిన తొలి సామాజిక విప్లవ చైతన్య స్ఫూర్తి మహాత్మ జ్యోతిరావు పూలే, ఈ దేశంలో స్త్రీ విద్యకు అంకురార్పణ చేసిన వ్యక్తి పూలే, మొదటిసారిగా స్త్రీలకు పాఠశాల నెలకొల్పి తన భార్య అయిన సావిత్రి పూలేను దేశంలో మొట్ట మొదటి ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దాడు, కరుడుగట్టిన నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ నిర్మూలనకు జీవితమంతా పరితపించినాడు, కావున మన%శీ% మహాత్మ జ్యోతిబాపూలే ని ఆదర్శంగా తీసుకొని సమాజాన్ని, మహిళలను చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది సామాజిక, రాజకీయ,ఆర్థిక అభివృద్ధితో పాటు కులవివక్షత వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు, ఏపిఎం బి శ్రీనివాస్, భారతి మండల మహిళా సమైక్య సంఘం అధ్యక్షురాలు మార్త లావణ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాదారపు మాణిక్యం, సీసీలు శారద, వెంకటయ్య, ఏకాంబరం, ఎస్ ఎన్ లావణ్య, శ్వేత, అరుణ,శ్రీలేఖ,సుభాషిణి, శోభ, వాణి ,శారద, గ్యార శ్యామ్ ,ఉపేందర్,ఈ శ్రీనివాస్,రాధిక, సుజాత,అనుష, సూర్య,జొన్నల స్వప్న, శ్రీను పాల్గొన్నారు

## మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ: ఎమ్మెల్యే దొంతి



**తొలిఅక్షరం/నెక్కొండ, నవంబర్ 28:** వరంగల్ జిల్లాలోని నెక్కొండ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నర్సంపేట అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటుకు సహకరించిన దాతలైన పుట్టపాక.యాదగిరి, కారింగుల. సురేష్,మేడగోని. వెంకటేశ్వర్లు,విగ్రహ కమిటీ నిర్వాహకులు తాళ్ళపెల్లి.చెన్నకేశవులు, గిరగాని. శ్రీనివాస్, గడ్డం.శ్రీనివాస్,పలుసం.పూర్ణ చందర్,గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు కక్కెర్ల.నాగయ్యను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ రంజిత్ రెడ్డి,మార్కెట్ చైర్మన్ హరీష్ రెడ్డి,మాదాటి.శ్రీనివాస్ గౌడ్ సొసైటీ చైర్మన్ మారం. రాము, బిఆర్ఎస్ నాయకులు కొమ్ము.రమేష్ యాదవ్,రవీందర్ రెడ్డి,దొనికెన.సారంగం, సంఘం నాయకులు కక్కెర్ల ఐలయ్య,మాదాటి.శ్రీనివాస్,గడ్డం.ఆనందం తదితరులు పాల్గొన్నారు.



# బీసి బాంధవులరా.. హక్కులకై ఉద్యమించండి..!!


- ఓట్లు మావి.. సీట్లు మీవా...
- ఓట్లువేసేయంత్రలంకాము,ఉద్యమించే నిప్పు కణలం..
- బీసి రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్..





**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 28:**బిసి బాంధవులారా తమ హక్కుల ఉద్యమించాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విశ్రాంతి భవనంలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి బీ సీ నాయకత్వం కమిటీల నిర్వహణ పై చర్చ గోష్టి నిర్వహించారు.ఈ చర్చ గోష్టి పిసి రాజ్యాధికార సమితి మండల అధ్యక్షులు వరి పెల్లి ఉప్పలయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముంజాల రాజేందర్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, బీసీలు అనగానే ఆది నుండి నేటి వరకూ అణగారిన వర్గాల వారిగా వ్యవసాయ కూలీలుగా చలామణి అవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. నాడు రాజకార్ల నుండి నేడు జరిగినటువంటి తెలంగాణ ఉద్యమం వరకు పోరాటం హక్కుల కొరకు కొట్లాడింది బీసీ వర్గం మాత్రమేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో బీసీల సంక్షేమ పథకాల అమలు కేటాయించిన బీసీల వాటా ఎటు పోతుందో మనలాంటి బీసీలకు తెలియకపోవడంవిడ్డూరమన్నారు.1938 లో కుల గణన జరగగా, నేడు జరిగినటువంటి కులగలనుస్వాగతిస్తున్నామన్నారు.1992 లో వీపీ సింగ్ ప్రభుత్వంలో జరిగినటువంటి రిజర్వేషన్లు 50% అమౌల్లో ఉన్నందున బిసి సామాజిక చెందిన పిల్లలు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. 60 శాతం నుండి 70% వరకు ఉన్నటువంటి బీసీ కులాలు ఉద్యోగ అవకాశాలు 15% రిజర్వేషన్ ఉండటంవల్ల ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ఉత్పాదక చేసేది మనం చట్టసభల్లో అధికారం అగ్రవర్ణాలదే పైచేయిగా ఉంటున్నదని, 2022లో ఈడబ్ల్యూఎస్ జీ వో 26 ను చట్టసభలో చర్చించకుండా కుట్రపూరితంగా తీసుకురావడం పట్ల ఇటీవల జరిగిన డీఎస్సీ నియామకాల్లో తీరని అన్యాయం జరిగిందని అన్నారు.**స్థానిక ఎన్నికల్లో బీసిలు సత్తా చాటాలి..: బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్..**వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చాటాలని జిల్లా బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు గంది వీరేందర్ గౌడ్ కోరారు. చట్టసభల్లో, రిజర్వేషన్లు అమలు చేయడం లో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను ఎండగట్టాడానికి గ్రామస్థాయిలో చైతన్యం తీసుకురావాలని, చట్టసభలోన్యాయం జరగాలంటే కమిటీలతో ముందుకు సాగాలని, లేనియెడల అగ్రవర్ణాల వారు ఓట్లు వేసే యంత్రాలుగా వినియోగించుకొని బీసీలను అణగదొక్కడం జరుగుతుందన్నారు. **మనం ఎంతో మన వాటా అంత..: సీనియర్ జర్నలిస్ట్ పంజాల వాసుదేవ్..**సమాజంలో 80 శాతం ఉన్న బిసి వర్గాలకు మనం ఎంతో మన వాటా అంత రావాల్సిన అవసరం ఉందని సీనియర్ జర్నలిస్ట్ పంజాల వాసుదేవ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. బిసి వర్ణాల్లో చైతన్యం, ఒక గొడుగు కిందికి రావలసిన సమయం ఆసన్నమైంది అన్నారు. స్వార్థ రాజకీయాల ప్రయోజనాలకు బీసీలను ఉపయోగించుకొవడం మూలంగానే బీసీలు అడుగున పడిపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికారం సమితి అధ్యక్షులుగా వరిపల్లి ఉప్పలయ్యను నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్ లు నియామక పత్రాన్ని అందజేశారు. తొలుత జ్యోతి రావు పులే వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సమావేశంలో బిసి రాజ్యాధికారం సమితి జిల్లా కార్యదర్శి రమణబోయిన వీరన్న, ప్రధాన కార్యదర్శి కొడుపుకంటి శ్రీధర్, జిల్లా యూత్ ఇంచార్జ్ పులిగిల్ల లింగేష్ జిల్లా సామాజిక నాయకులు దండం వెంకన్న వివిధ కుల సంఘాల బాధ్యులు గూగుల్ మల్లయ్య యాదవ్ తిరుమల గుట్టయ్య గౌడ్ ,కుమ్మరి కుంట్ల మహేందర్, రత్నపురం యాకయ్య, గొల్లపల్లి యాదగిరి, బాబు గౌడ్ ,మంచాల వెంకన్న, సంపత్ సుధాకర్, కొప్పు శ్రీను, పయ్యావుల బిక్షం, పోతరాజు యాదగిరి, డాక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ నివేషిత స్థలాలపై విచారణ చేపట్టాలి..



**తొలి అక్షరం/ నెల్లికుదురు,నవంబర్ 28:** నెల్లికుదురు మండలం బంజర గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎస్సినివేషిత స్థలాలపై విచారణ చేపట్టాలని ఆ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు ఇరుగు అనిల్,గుండెపాక నర్సయ్య,లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విశ్రాంతి భవనంలో విలేఖర్లతో మాట్లాడుతూ బంజర గ్రామం సర్వేనెంబర్ 309/1/3/1 నర్సింహుల గూడెం శివారులో కలదు.ఇట్టి భూమి ఎస్సీ,నివేశిత స్థల మైనటువంటి అర్జున ఆ బాది, అని ఎకరం 11 గుంటలు పహానిలో ఉండగా ఆ భూమిని బండ్ల ఉపేందర్ రెడ్డి తండ్రి సుగుణయ్య అను వ్యక్తి అక్రమంగా తమ పేరుపై పట్ట చేయించుకోవడం జరిగిందన్నారు.ఆదే స్థలాన్ని ఉపేందర్ రెడ్డి కూతురు సుడిగాలి సిరి చందన పేర రిజిస్ట్రేషన్ చేయగా మళ్లీ ఈనెల 20 తారీకున ఇంద్రమ్మ కమిటీ సభ్యుడైన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఆరాల సుధాకర్ తండ్రి ఐలయ్య పేర రిజిస్ట్రేషన్ చేయడంజరిగిందన్నారు.అట్టి భూమి ఎస్సీలకు తరతరాల నుండి కుటుంబాలు గృహాలు కట్టుకొని నివసిస్తుండగా ఇటువంటి భూమిని అక్రమంగా బండ్ల ఉపేందర్ రెడ్డి తమ కుటుంబ అవసరాల కొరకు లోన్లనిమిత్తం రాతపూర్వకంగా పహణి కాలంలో తమ పేరుపై మార్పిడి చేయించుకున్నారని ఎస్సీల నీవేషిత స్థలం అని తెలిసి కూడా మరల మరల పేరు మార్పిడి చేయించుకోవడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు.సర్వే నెంబర్ 3%శీ%9/1/3/1 లో భూమిపై త్వరలో జిల్లా కలెక్టర్ గ్రివెన్ సెల్ లో పిర్యాదు చేయనున్నట్లు ఈ సందర్భంగావెల్లడించారు.ఇట్టి భూమి పై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# డా.అపికట్ల భరత్ భూషణ్‌నీ కలిసిన టీవైజేఫ్ అధ్యక్షులు డా.జితేందర్ రావు



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),నవంబర్28:**ఐఅర్టిఎస్ (రిటైర్డ్ ఆఫీసర్ డాక్టర్ అపికట్ల భరత్ భూషణ్ ను వారి నివాసం యాప్రాల్ లో మర్యాదపూర్వకంగా కలిసిన టీవైజేఫ్ అధ్యక్షులు డాక్టర్ జితేందర్ రావు తనుగుల,టీవైజేఎఫ్ వైస్ ప్రెసిడెంట్ జీవన్,టీవైజెఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రెసిడెంట్ పస్తం సైదులు, కాకతీయ యూనివర్సిటీ ప్రెసిడెంట్ రాజేందర్ తో కలిసి వారి సేవా కార్యక్రమాలను గుర్తించి కొనియాడి సాలువతో సత్కరించారు.ఈ సంధ్బంగా టీవైజేఫ్ అధ్యక్షులు డా.జితేందర్ రావు మాట్లాడుతూ...తమ యూనియన్ కు సహాయ సహకారాలు ఉండాలని డా.అపికట్ల భరత్ భూషణ్ ని కోరారు.దానికి భరత్ భూషణ్ స్పందిస్తూ ఎల్లప్పుడు తన వంతుసహకారం ఉంటుందని ఆయన తెలుపారు.

# పంజా విప్పిన చలి పులి

- వణుకుతున్న వృద్ధులు చిన్నపిల్లలు మహిళలు



**తొలి అక్షరం/కేసముద్రం నవంబర్ 28:**రాష్ట్రంలో చలి తీవ్రతతో మహబూబాద్ జిల్లా కేసముద్రంలో గత ఐదు రోజులుగా చలిపులి పంజాబిట్టగా ఆ తీవ్రతతో మహిళలు వృద్ధులు చంటి పిల్లలు యాచకులు వణుకుతూ ఇబ్బంది గురవుతున్నారు చలి తీవ్రతతో పాటు మబ్బు పట్టడంతో మధ్యాహ్నం ఒకటింటి వరకు ఎండ రాకపోవడంతో ఈదురు గాలులతో కేసముద్రం మండలం ప్రజలు ఇండ్లలో నుంచి బయటికి రావాలంటేనే భయానికి గురవు తున్నారు ఇంటిలోనే ఉండిపోయారు అధికమైన చలి తీవ్ర గాలితో చర్మం పొడి వారి పగులుతూ ఒళ్లంతా మంటలతో ఇబ్బంది గురవుతున్నారు ఇది ఇలాగే కొనసాగితే డిసెంబర్ ఎలాగా గడపాలని ఒక్కొక్కరు భయపడుతున్నారు ఈ చలిపులికి, చలి ఈదురుగాలి తాకిడి వల్ల చెద్దర్లు బ్లాంకెట్లు మా మఫ్లర్స్ చలికోట్ల స్వెటర్స్ గిరాకీ బాగా పెరిగింది చంకల్లో నుంచి చేయి తీయాలంటే భయపడుతున్నారు ప్రజలు అంతగా చలి తీవ్రత ఉన్నది కాలమాన పరిశీల ప్రజలకు దేవుడే తోడుండాలి.

# ధాన్యంను వెనువెంటనే మిల్లర్లకు తరలించాలి..

- సిపిఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు..



**తొలి అక్షరం/నెల్లికుదురు,నవంబర్ 28:** ప్రభుత్వం రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్న ధాన్యం ను వెను వెంటనే మిల్లర్లకు తరలించాలని సిపిఎం మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రము లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు.అనంతరం సైదులు మాట్లాడుతూ,రైతుల ధాన్యం తరలింపుకు లారీలను సరిపడా సమకూర్చాలని రైతులు తెచ్చిన ధాన్యాన్ని త్వరిత గతిన కాంటాలు నిర్వహించి, నింపిన బస్తాలను తరలించడంలో లారీల లోపం ఉండటం వలన వాతావరణం అనుకూలించకపోతే వర్షాలు వస్తే కాంటాలు అయిన రైతులకు నష్టంజరుగుతుందన్నారు.వర్షం వస్తే బస్తాలు నష్టం జరుగకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రత్యేక దృష్టి పెట్టి లారీలను సమకూర్చి రైతులకు నష్టం జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పెరుమాండ్ల బాబుగౌడ్ బాణాల యాకయ్య రాజు వెంకటయ్య కొమరయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసక్తిగా జిల్లా వైద్య విజ్ఞానిక ప్రదర్శన వినూతన వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల ప్రతిభ





**తొలిఅక్షరం/నర్సంపేట,28:** నర్సంపేట నియోజకవర్గంలోని స్థానిక శివాని పాఠశాలలో జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్య క్రమానికి దుగ్గొండి మండల కేంద్రానికి చెందిన నాచినపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞాన పరికరాలను సందర్శించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయుల బృందం విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన అవగాహన ఏర్పరచు విద్యార్థులు సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలియజేయడం జరిగింది కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థి త్రినేష్ గైడ్ టీచరు సుధీర్ రోడ్డుపై పశువులు రక్షణ కొరకు వాహనాదారులకు అనుకోకుండా అడ్డుగా వచ్చే పశువులకు ఎటువంటి ఆక్సిడెంట్లు సెన్సార్ల ద్వారా వాహనాదారులకు తెలియజేసేప్రత్యేక పరికరాన్ని ఎక్సిబిట్లుగా ప్రదర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని మరియు ఉపాధ్యాయుల బృందం శ్రీనివాస్,మాధవరావు, కమలాదేవి,గీత తదితరులు పాల్గొన్నారు.

# సమన్యాయం కోసం పోరాడిన సంఘ సంస్కర్త పూలే

- పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు), నవంబర్28:**దేశంలో సమన్యాయం కోసం పోరాడిన మహనీయులు జ్యోతిరావు అని పాస్,రాష్ట్ర డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు.గురువారం పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రంలోని పూలే ప్రాంగణంలో 134వ వర్ధంతి సందర్భంగా పాస్,రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు విచ్చేసి నివాళు లర్పించారు. ముఖ్యఅతిథిగా పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ గాంధీజీ కంటే ముందే మహాత్మగా పిలువబడ్డ జ్యోతిరావు పూలే అంబేద్కర్ వంటి మహనీయునికి స్ఫూర్తినిచ్చారని గుర్తు చేశారు. భారతదేశంలోని శూద్రాతి శూద్రులు బ్రాహ్మణీయ కుల వ్యవస్థలో బానిసలుగా ఉన్నారనీ, బడుగులు బానిసలుగా ఉండడానికి బ్రాహ్మ ణీయ దోపిడీ, అణచివేత, వివక్షలను అర్థం చేసుకోకపోవడం, అందుకు చదువు లేకపోవడమే మూలమని పూలే గ్రహించి ఎన్నో పాఠశాలలు ప్రారంభించిన మహానుభావులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అట్టడుగు వర్గాలను కోరారు.అధ్యక్షులు ప్రొఫెసర్ ఏ. సదానందం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ వడ్డే రవీందర్, పాస్ రాష్ట్ర కార్యదర్శి చంద మల్లయ్య, పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్,జిల్లా ఉపాధ్యక్షులు బాబు యాదవ్, నాయకులు ప్రొఫెసర్ ఎం సారంగపాణి, ప్రొఫెసర్ సిహెచ్ సమ్మయ్య,డాక్టర్ పులి కోటేశ్వర్, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, డాక్టర్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రజలు సమస్యలపై పరిష్కరించాలని ముఖ్యమంత్రికి వినతి



**తొలి అక్షరం/డోర్నకల్ నవంబర్ 28:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గిరిజన ప్రజల సమస్యల్ని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి పత్రం అందజేసిన గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ మరియు గిరిజన శక్తి వ్యవస్థాపకులు డా. వెంకటేష్ చౌహన్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బు నాయక్, రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ రమేష్ రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే, కుంగ్ ఫుతోనే శారీరక, మానసిక వికాసం

- చదువుతోపాటు శారీరక ఆరోగ్య మానసిక వికాసం కూడా చాలా అవసరం: సీనిహీరో సుమన్



**తొలి అక్షరం/షాద్ నగర్ నవంబర్ 28:** కరాటే తోనే విద్యార్థులకు, యువతకు శారీరకంగా మానసికంగా ఎంతో ఉపయోగపడుతాయని సీనిహీరో, కరాటే కింగ్ సుమన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ అధ్వర్యంలో కుంగ్ ఫు విద్యార్థులు హైదరాబాద్ లో సినిహీరో సుమన్ ను కలిశారు. అహ్మద్ మాస్టర్ హీరో సుమన్‌ను శాలువా, పూలమాల తో సత్కరించారు. కుంగ్ ఫు విద్యార్థులకు హీరో సుమన్ సర్టిఫికెట్ లు అందజేసి అభినందనలు తెలియ జేశారు. కుంగ్ ఫులో మంచి ప్రావీణ్యం సంపాదించి తల్లిదం డ్రులకు,ఊరికి,రాష్ట్రనికి, దేశానికి మంచి పేరు తేవాలని అన్నారు.

# పాపయ్యపేట జెడ్పి ఉన్నత పాఠశాల నుండి ఎలక్ట్రిసిటీ ఫ్రమ్ నాన్ బయో డిగ్రేబుల్‌నీ ప్రదర్శించిన విద్యార్థి



**తొలిఅక్షరం/నవంబర్ 28 (చెన్నారావుపేట):** చెన్నారావుపేట మండల కేంద్రం లోని జిల్లా విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా మండల కేంద్రంలోని పాపయ్యపేట జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థి తన్వేష్ ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి మ ఆధ్వర్యంలో ఇళ్లల్లో చెత్త ప్లాస్టిక్ మ రియు ఇతర పనికిరాని వస్తువుల ను బయటపడేస్తుంటారు వ్యర్థాలు నుంచి విద్యార్థులు ఉత్పత్తి చేయడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించే పరిక జనరేటింగ్ ఎలక్ట్రిసిటీ ఫ్రం నాన్ బయో డీగ్రేబుల్ వేస్ట్ ను తయారు చేశారు చెత్తను ఒక ఇనుప జారిలో వేసి కాల్చుతారు దానికి బిగించిన సోలార్ ప్యానల్ తో విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు దీని నుంచి వెలువడిన పొగను గ్యాస్ ప్యూరిఫైయర్ ద్వారా గాలిలోకి వదలడంతో కాలుష్యాన్ని తగ్గించవచ్చు అని ప్రాజెక్టును వివరించడం జరిగింది.